# కర్మసిద్ధాంతులు

**ఈ** కాలంలో పదిమంది బంధువులొక చోట కూడటమంటే అది కేవలం దైవికంగా జరగవలసిందే గాని మానవయత్నంవల్ల జరిగే విషయమా? అందులోనూ మాది చాలా పెద్ద బలగం. మా తాతయ్యకు ఆరుగురు కొడుకులూ, అయిదుగురు కూతుళ్ళూనూ. మా తరం వాళ్ళం ఇరవై అయిదుగురం ఉన్నాం. అందులో యింటి పేర్లు మార్చేసుకున్న పదముగ్గురాడపిల్లల్ని మినహాయించినా పన్నెండు మందిమి ఉన్నాం. మా తరవాత అప్పుడే ఒక తరం తయారయ్యింది. చెప్పొచ్చిందేమిటంటే మా బలగం పెద్దది. అయితేనేం? నామటుకు నేను అయిన వాళ్ళను చూసి దాదాపు అయిదేళ్లయింది. మా రాముడు బావా, రాఘవులన్నయ్యా ఢిల్లీలో వున్నారు. ఉమాపతి బొంబాయిలో ఉన్నాడు. సుబ్రహ్మణ్యం కలకత్తాలో ఉన్నాడు. కృష్ణమూర్తి బెంగుళూరు బదిలీ అయ్యాడు ఈ మధ్యనే. కాంతారావు విశాఖపట్నంలో ఉంటున్నాగాని ఎవరికీ ఉత్తరం ముక్క రాయడుగదా. శ్రీనివాసులు సికింద్రాబాదునుంచి పుష్కరానికోసారిగాని బయలు దేరడు. వాడికి పిల్లలు పుడుతున్నారు, పెళ్ళిళ్ళై అత్తవారిళ్లక్కూడా పోతున్నారు. వాళ్ళని మేం చూస్తే కూడా గుర్తుపట్టలేం. ఇదంతా చెప్పుకుపోతే మహాభారతమంత గాథ అవుతుంది. పరిస్థితి బోధపడుతూనే ఉంది కాదూ?

నిజానికీ విచ్ఛిత్తి మా తాతయ్య బతికుండగానే ప్రారంభమయింది. మా పెదనాన్న సూరయ్యగారు దారితీశారు. అయన రంగూనుకు బయలుదేరిన మరుసటి ఏడు కాబోలు మా రెండో పెదనాన్న చదువు వంకబెట్టి కలకత్తా బయలుదేరాడు. మా నాన్న పెళ్ళి కాగానే మద్రాసు మీద ఆశలు పెట్టుకున్నాడు. ఎందుకంటే మా రెండో మేనమామ మద్రాసులో ప్లీడరు ప్రాక్టీసు పెట్టి, మద్రాసులో వ్యాపారం పెట్టమని మా నాన్నకి పురెక్కించాడు. మానాన్న తరవాతవాళ్ళు మాతాత బతికుండగా కదలలేదు.

అప్పటికీ మా తాత ఒక్కటి మాత్రం సాధించగలిగాడు. ఏటా ఆయన దేవీ నవ రాత్రులకు కసశం పెట్టేవాడు. ఆ సమయానికి ఎక్కడెక్కడ ఉన్నవాళ్లూ కొంప చేరుకోవలసిందే. ఆ పదిరోజులూ ఇల్లు మహావైభవంగా ఉండేది. రకరకాల వయస్సులుగల ఆ ఆడ, మగమూకను చూసుకుని మా తాత చాలా సంతోషించేవాడు. "నేను దేహం విడిచేనాటికి అందరూ నా చుట్టూ ఉండితీరవలసిందే" అని ఆయన అనేవాట్ట. మొత్తానికి

అంతపనీ చేసి ఆయన, నేను పేదవాణ్ణయి ఉండగా నవరాత్రుల్లోనే పోయాడు! జాతక మంటే ఆయనదీ.

జాతకమంటే జ్ఞాపకం వచ్చింది. మా సుబ్బయ్య బాబాయి గొప్ప జ్యోతిష్కుడు. నాకు జ్యోతిష్యంలో అంత నమ్మకం లేదు. కాని ఆయన చెప్పినవి చాలా జరిగినాయి. ఇది తెలిసి ఉండటంవల్లనే నేను జ్యోతిషాన్ని పూర్తిగా కొట్టెయ్యలేను. కలకత్తా యూనివర్సిటీలో బియ్యేపాసయిన మా శేషగిరి పెదనాన్న 1930లో చచ్చే ఖాయిలా పడ్డాడు. ఆయన తిరిగి కోలుకుంటాడని ఎవరూ అనుకోలేదు. మా సుబ్బయ్య బాబాయి ఆయన జాతకం చూసి, నీకు 1935 దాకా ఢోకా లేదు. తరవాతి సంగతి చూసుకుందాంలే, అని చెప్పేశాడు. శేషగిరి గారు మళ్ళాలేచి తిరిగారు. 1935 మే నెలలో వడదెబ్బ తగిలికాదూ ఆయన పోయిందీ? ఇటువంటివి కళ్ళారా చూసికూడా జ్యోతిషంలో ఏమీ లేదనటం ఎట్లా? తొందరపడకండి. మీరనబోయేది నాకూ తెలుసు. నేను మీతోనూ ఏకీభవిస్తాను. రాసి పెట్టి ఉంటే భోజనం చెయ్యలేక పోతామా అని ఎవరమూ పొయ్యి రాజెయ్యకుండా ఉండటంలేదు. కార్యకారణ సంబంధం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. ఫలాని రోగాలకు ఫలాని మందులిస్తున్నాం. దేశంలో సమృద్ధిఉంటే జాతులు బాగుపడుతున్నాయి, లేకపోతే పురుగుముట్టి పోతున్నాయి. అంతా నాకు తెలుసు కాని...

అసలు విషయం మరిచాను. కిందటి మార్చ్‌లో తలవని తలంపుగా – దైవికంగా అని కాదూ అన్నానూ? ఈ విసిరి పారేసిన బలగంలో పాతిక మందిమి ఒక్కచోట కలిశాం. ఏ కార్యకారణ సంబంధంవల్ల కలిశామో నాకు తెలీదు. కొందరికి కబుర్లు వెళ్ళినమాట నిజమే. కాని మరికొందరు అనుకోకుండానే తటస్థపడ్డారు. అన్నిటికన్నా ముఖ్యమేమంటే మా సూరయ్య పెదనాన్న కూడా అక్కడ చేరాడు. మా కుటుంబాలకు మాతాత తరవాత తాత అంతటివాడు, ఆయన వచ్చాడని చూడవచ్చినవారు లేకపోలేదు. (వచ్చినందుకు వట్టి చేతులతో తిరిగి వెళ్ళలేదులెండి.)

పెద్దలూ, పిన్నలూ అంతా ఒకరాత్రి భోజనాలై డాబామీద కూర్చున్నాం. వెన్నెల కూడా ఉంది. మా పెదనాన్న చుట్టూ సుబ్బమ్మత్తయ్య, శంకరం మామయ్యా, శేషమ్మపిన్నీ, సుబ్బయ్య బాబాయి, నరసింహం బాబాయి, ఇంకా ఇతర పెద్దలూ ఉన్నారు. ఇంతమందీ చేరాక కష్టసుఖాలూ, మంచి చెడ్డలూ రాకుండా ఉంటాయా? కుటుంబాలమధ్య కలహాలొచ్చాయి. కుటుంబాలు చితికిపోయాయి. హెచ్చుతగ్గుల విచక్షణలొచ్చాయి. అయిన వాళ్ళకివ్వకా చేసుకోకా పెళ్ళిసంబంధాలకు యితరత్రా వెళ్ళారు. వారు ఇదనీ, వీరు ఇదనీ ఆరోపణలు బయల్దేరాయి. కొందరు కొందర్ని సమర్థించారు. మరికొందరు

మరికొందర్ని వెనకేసుకొచ్చారు. కుర్రకారులో అనేకమందికి ఈ పెద్దలేం మాట్లాడుతున్నదీ తెలిసింది కూడా కాదు.

"ఒరే, ఇవన్నీ ఎందుకర్రా? నాకు అరవై దాటాయి. నా అనుభవం కాస్త వింటారూ?" అన్నాడు మా పెదనాన్న. అందరూ సద్దుమణిగారు. "నేను సమర్థుణ్ణా? అసమర్థుణ్ణా? ఎవరన్నా చెప్పగలరూ?"

"ఎంత సమర్థుడివి కాకపోతే రెండు చేతులా అంతడబ్బు గడించావు, బావా?" అన్నాడు మా శంకరం మామయ్య.

"అది అబద్ధం!" అన్నాడు మా పెదనాన్న. "చిత్తశుద్ధిగా చెప్పాలంటే నేను బతికుండగా ఇంతమందిమి కలుస్తామోలేదో నాకే తెలీదు. నా ప్రయోజకత్వం ఏమిటో నేను చెప్పలేను. నేను వ్యాపారం చేశాను. బాగా లాభం తీస్తాననుకున్న చోట నష్టం వచ్చింది. ఉటుడియంగా, అవకతవకగా చేసిన వ్యాపారంలో చచ్చే లాభం వచ్చింది. ఇంకోటి చెబుతా, నేను చచ్చిబతికినన్ని సార్లు మీరెవరూ చచ్చిబతికి ఉండరు. ప్రతిసారీ నాకొకటే అనిపించింది. ఎవరో ఎందుకో నన్ను చావకుండా కాపాడుతున్నారు! చెబితే అతిశయోక్తిగా తోస్తుందేమోగాని నాకిప్పుడు చావు భయంలేదు. డబ్బు పోతుందనే భయంలేదు. నా జీవితానికి కర్తను నేను కాననే నమ్మకం కుదిరిపోయింది. ఏనాడో చావు మళ్ళీ సమీపిస్తుంది. నాకూ చావుకూ మధ్య ఎవరూ అడ్డుపడరు. దాంతో నాజీవితం చెల్లు! మీకెవరికీ బహుశా తెలీదు. కిందటి యుద్ధమప్పుడు బర్మాలో నాడబ్బు చాలా పోయింది. నాకేమీ విచారం కలగలేదు. మీదు మిక్కిలి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వాళ్ళను చూస్తూ, 'ఈ నాటకానికి అర్థం ఏమిటో?' అని ఆశ్చర్యపడ్డాను. గొప్ప చదరంగం ఆటగురించి చదరంగప్పావుకు ఎంత తెలుసో నాకూ నా జీవితం గురించి అంతే తెలుసు."

ఆయన ఈ మాటలంటుంటే అందరూ గంభీరంగా అయిపోయినారు. పనికిమాలిన వేదాంతం వినేటప్పుడు మనుషులా విధంగా అయిపోవడం నేను చాలాసార్లు గమనించాను.

"కాక, మరేమిటి? అంతా కర్మ, మనం దేనికీ కర్తలం కాము" అన్నది శేషమ్మపిన్ని. అయిదు నిమిషాల క్రితం ఈవిడే తనకూతుర్ని శంకరం మామయ్య కొడుక్కి చేసుకోలేదని తెగ దెప్పింది.

ఒకళ్ల తరవాత ఒకళ్లమూ పెద్దనాన్నతో ఏకీభవించి ఆయన మాటలలో ఉన్న-ఉన్నదని కనీసం వాళ్ళనుకున్న కర్మ సిద్ధాంతాన్ని గట్టిగా బలపరచసాగారు.

మానవయత్నానికి దమ్మిడీ విలువ యివ్వనందుకే మా పెదనాన్నమీద నాకు కొంచెం చిరాకుగా ఉంటే ఆయనతో ఏకీభవించే ఈ ముచ్చులమీద చెప్పరాని క్రోధం కలిగింది.

"అదికాదు, పెదనాన్నా, నీకేం కోరికలు లేవా? వాటిని తీర్చుకోవటానికి నువు ప్రయత్నం చెయ్యటం లేదూ?" అన్నాను.

"ఒరే నువ్వు రైళ్లల్లో ప్రయాణం చేశావుకదా. రైలు తనదారిన పోతుంటే పెట్టెలో నీకు తోచినట్టు నువు తిరిగి ఉంటావు. కాని రైలు నడకకు నువు కట్టుపడిలేవూ? దానిపోకడతో పోలిస్తే నీదొక పోకడా? నీయిష్టం వచ్చిన చోటుకి నువు పోతున్నావనటంలో అర్థం ఉందా?" అన్నాడు పెదనాన్న.

"బాబాయి జ్యోతిష్యంలో నీకుకూడా నమ్మకం ఉందన్నమాట" అన్నాను. "అంతా రాసిపెట్టి ఉందంటావు?"

"రాసిపెట్టి ఉండటమనేది నమ్మకపోవటం ఒక మూఢ విశ్వాసమైపోయింది ఈ కాలపు వాళ్ళకు. పుట్టిన జీవి చచ్చిపోతుందని రాసి పెట్టిలేదూ? ఆడవాళ్ళే పిల్లల్ని కనాలని రాసిపెట్టి లేదూ? మనుషులకు ఏడెనిమిదేళ్ళప్పుడు పళ్ళూడి రావాలనీ, మగవాళ్ళకి యవ్వనంలో గడ్డాలూ మీసాలూ రావాలని రాసి పెట్టిలేదూ? వాటిని నమ్మటం తప్పులేదేం?" అన్నాడు పెదనాన్న.

"అదివేరు, అదంతా శాస్త్రవిజ్ఞానం" అన్నాను.

"సుబ్బయ్య చెప్పే జ్యోతిష్యం శాస్త్రవిజ్ఞానం కాదని నిరూపిస్తావా? అసలు శాస్త్రవిజ్ఞానం ఏది అవునో ఏదికాదో నీకు తెలుసునా? జియోలజీ శాస్త్రం కాదన్నారు. బయోలజీ శాస్త్రం కాదన్నారు."

"అవి శాస్త్రాలనిపించుకున్నాయి ఒకనాటికైనా, జ్యోతిషం అట్లాకాదే. వంద జాతకాలు చూసి బాబాయి ఎంతమందికి సరిగా చెప్పగలడు?" ఎన్ని విషయాలు సరిగా చెప్పగలడు?"

"బాబాయి ఒక్కడే జ్యోతిషానికి అధిపతా? ఒక డాక్టరు వందకేసుల్లో మూడే నయం చేసినంత మాత్రాన వైద్యం శాస్త్రం కాదంటారా? ఎందుకంటే అరడజను మంది ఎవరికివాళ్ళు నయం కాదన్న కేసు, చిట్కా వైద్యంతో కుదరగా నేను చూశాను."

"నువు చాలా చూశావు అందుకే నీతో వాదించటం కష్టం" అన్నాను.

"పిచ్చివాడా యిది వాదించే విషయం కాదు. ఇంతపెద్ద సృష్టికి మనిషే నియంత అనుకున్నంత కాలమూ తప్పుదారి పట్టటం చాలా సులభం. మనిషిని మించిన శక్తులు జగత్తును నడిపిస్తున్నాయన్నది అనుమానం తగిలినాక నీవైఖరి మారితీరాలి. మాటవరసకు చెట్లు మనుషులనే వాళ్లున్నారని పసిగట్టాయనుకో!"

అనుకున్నాను. అనుకుని ఆశ్చర్యపడసాగాను. కాని పెదనాన్నతో పూర్తిగా ఏకీభవించనూ లేదు. బొత్తిగా ఏకీభవించక పోనూలేదు.

మా సంభాషణ ఇంకెంతదూరం సాగేదో. ఇంతలో మా నరసింహం బాబాయి దత్తపుత్రుడు చంద్రం వచ్చాడు. వాణ్ణి చూడగానే అందరూ అంతో యింతో

బిగుసుకుపోయారు. ఎందుకంటే వాడు కమ్యూనిస్టు. ఈ మధ్య రెండేళ్ళు అండర్ గ్రౌండ్‌లో ఉండివచ్చాడు. వాడికీ తండ్రికీ మాటలులేవు. మా బలగానికి చాలా మచ్చలున్నాయి. దొంగతనాలుచేసి ఖైదుఅయిన వాళ్ళున్నారు, దొంగవ్యాపారం చేసి జరిమానా ఇచ్చుకున్నవాళ్ళున్నారు, తాగుబోతులూ, వ్యభిచారులూకూడా ఉన్నారు. రేసులలోనూ పేకాటలోనూ సర్వస్వం పోగొట్టుకున్న వాళ్లున్నారు. కాని అన్ని మచ్చలనూ తలదన్నిన మచ్చ చంద్రం. మా బంధువులలో చాలామంది దృష్టిలో చంద్రం హంతకుల జాబితాలో వాడు. దేశద్రోహుల జాబితాలోవాడు. విదేశీయుల ఏజెంట్ల జాబితాలో వాడు.

పెదనాన్న చంద్రాన్ని గుర్తుపట్టినట్టు లేదు. ఇంకెవరూ వాణ్ణి పరిచయం చెయ్యరని తెలిసి నేనే పరిచయం చేశాను.

"ఓహో! వీణ్ణి నేను ఆరేళ్ళక్రితం చూశాను. బాగా పెరిగాడు" అన్నాడు పెదనాన్న.

"వాడిప్పుడు కమ్యూనిస్టు. మెట్టపల్లాలేకం చేసి వర్గరాహిత్యం సాధించి, సామ్యవాదం నిలబెట్టుకునేటందుకు జీవితం అంకితం చేస్తున్నాడు" అన్నాను.

"అట్లాగా?" అన్నాడు పెదనాన్న.

ఆయనవంటి ఆస్తికుడు, చంద్రంవంటి నాస్తికుణ్ణి గురించి అంతకంటే ఏమీ అనకపోవటం నాకే నిరాశ కలిగించింది. పెదనాన్న ఇంతకు మునుపు అంటున్న మాటలకు ఎదురు వాదించవలసిన అసలు మనిషి చంద్రం.

"పెదనాన్న కర్మ సిద్ధాంతం చెపుతున్నాడురా, చంద్రం! మనచేతిలో ఏమీ లేదుట. అంతా భగవంతుడి చేతులో కీలు బొమ్మలట" అన్నాను.

చంద్రం వెటకారంగా నవ్వాడు.

"ఎంతమంది నెత్తిన చెయ్యిపెట్టి అంతలేసిడబ్బు సంపాదించాడో! తనచేతిలో ఏమీలేదనక తానే ఆ అన్యాయం అంతా చేశానని ఒప్పుకుంటాడా?" అన్నాడు చంద్రం.

దానిక్కూడా పెదనాన్న ఏమీ మాట్లాడలేదు. మరో అయిదు నిమిషాలు కూర్చుని చంద్రం వెళ్ళిపోయినాడు. ఆ అయిదు నిమిషాలుకూడా ఎవరిలోనూ ఏమీ చైతన్యం లేదు. ఎవరిమటుకు వాళ్ళు స్తంభించిపోయారు. ఆఖరుకు పెదనాన్న కూడా స్తంభించిపోయినట్టే కనపడ్డాడు.

కాని చంద్రం వెళ్ళిపోగానే తిరిగి అందరిలోనూ చైతన్యం వచ్చింది. కొద్దిమందిలో కాస్త మోతాదుకు మించికూడా వచ్చింది.

"దొరక్క దొరక్క నరసింహానికి వీడు దొరికాడు చూడు!"

"ఈ కమ్యూనిస్టులంతా ఒకటే మచ్చు, పెద్దా, పిన్నా, దేవుడు, దైవం, మంచీ, చెడ్డా విచక్షణే లేదు. చెదపురుగులల్లే చేరినచోటల్లా నిర్మూలనం సాగించి వదిలిపెడతారు. వీళ్ళ బతుకు చెడా!" అన్నాడు శంకరం మామయ్య.

"ఏం పెదనాన్నా? నువు కమ్యూనిస్టులను తిట్టేవాళ్ళతో ఏకీభవించవా ఏమిటి?" అన్నాను.

"ఎందుకు వాళ్ళను తిట్టడం?" అన్నాడు పెదనాన్న.

అందరూ ఆయనకేసి వింతగా చూశారు.

"ఈ జీవిత నాటకంలో భగవంతుడు వాళ్ళచేత చాలా పెద్దపాత్ర ధరింపజేస్తున్నట్టు నాకు కనిపిస్తోంది. చరిత్రలో వాళ్లు నిర్వహించే పాత్ర చూస్తున్నాను. భగవంతుడు వాళ్లకు కలిగించే ప్రేరణలు చూస్తున్నాను. ఇందాక నువు మన కోరికల గురించీ అవి తీర్చుకునేటందుకు మనం చేసే యత్నాలు చూస్తే నాబుద్ధి ఒక్కొక్కసారి దిమ్మర పోతుంది. కమ్యూనిస్టులను గురించి హేయంగా భావించటానికి నాకేమీ కారణం కనిపించటంలేదు" అన్నాడు పెదనాన్న.

అక్కడ ఆ క్షణాన ఉన్నవారిలో ఒకరైనా ఆయనను సమర్థించటానికి ముందుకు రాలేదు.

"అయ్యో, పెదనాన్నా, ఇక్కడ కర్మసిద్ధాంతం మాట్లాడేవాళ్లు చాలామంది ఉన్నారు గాని, నిజమైన కర్మసిద్ధాంతివి నువ్వొక్కడివే కనిపిస్తున్నావు!" అనేశాను.

***మొదటి ముద్రణ: ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక, 16 జూన్ 1954***